
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
వికారాబాద్ - మేడ్చల్
జిల్లాల వార్తలు
5
ఆదివారం 6 అక్టోబరు 2024



● గాయత్రీ దేవిగా...



దసరా నవరాత్రుల్లో భాగంగా వికారాబాద్, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాల్లో ప్రతిష్ఠించిన అమ్మవార్లు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిస్తున్నారు. మూడోరోజు శనివారం భక్తులు, మండపాల నిర్వాహకులు ప్రత్యేక పూజలు చేయగా, మహిళలు కుంకుమార్చన చేశారు. కీసరగుట్టపై దుర్గామాత గాయత్రీదేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చింది. - కీసరరూరల్, అక్టోబరు 5

బతుకమ్మ సంబురాలు



సంస్కృతీ సంప్రదాయాలకు అద్దం పట్టే బతుకమ్మ వేడుకలు వికారాబాద్, మేడ్చల్ జిల్లాల్లో అట్టహాసంగా జరుపుకుంటున్నారు. శనివారం మేడ్చల్ - మల్కాజిగిరి కలెక్టరేట్ ఆవరణలో మూడో రోజు ముద్దపప్పు బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. రెవెన్యూ, వైద్య శాఖల ఆధ్వర్యంలో రంగు రంగు పూలతో భారీ బతుకమ్మలను పేర్చి ఒక చోటకు చేర్చి గౌరమ్మకు పూజలు చేసి ఉద్యోగులు ఆడిపాడారు. డీఆర్‌వో హరిప్రియ, లాఆఫీసర్ చంద్రవతి, డీఎంహెచ్ఓ రఘునాథస్వామి, రామకృష్ణారెడ్డి సంబరాల్లో పాల్గొన్నారు. - మేడ్చల్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

ముత్యాల పందిరిలో అనంతుడు



ఆలంపల్లి శ్రీ అనంతపద్మనాభ స్వామి దేవాలయంలో దసరా ఉత్సవాలు కనుల పండువగా సాగుతున్నాయి. శనివారం ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి, ముత్యాల పందిరిలో పురవీధుల్లో ఊరేగించారు. భక్తులు, పట్టణ ప్రముఖులు తరలి వచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. కాగా వికారాబాద్ పట్టణంలోని వెంకటేశ్వర స్వామి దేవాలయంలో స్వామి వారి కల్యాణం ఘనంగా నిర్వహించారు. సాయంత్రం హంస వాహనంపై ఊరేగించారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. - వికారాబాద్, అక్టోబరు 5



అధికారులతో మాట్లాడుతున్న మాణిక్‌రాజ్ కనన్

అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

సీఎం ఓఎస్‌డీ మాణిక్‌రాజ్ కనన్

మెడికల్, పశువైద్య కళాశాలల స్థల పరిశీలన

కొడంగల్, అక్టోబరు 5: కొడంగల్ నియోజకవర్గ అభివృద్ధి పనులను వేగవంతం చేసేందుకు సంబంధిత అధికారులు దృష్టి సారించాలని సీఎం ఓఎస్‌డీ మాణిక్‌రాజ్ కనన్ ఆదేశించారు. శనివారం కొడంగల్‌లో సీఎం ఓఎస్‌డీ మాణిక్‌రాజ్ కనన్ వికారాబాద్, నారాయణపేట్ జిల్లాల కలెక్టర్లు ప్రతీక్‌జైన్, సిక్తా పట్నాయక్, కడాఅధికారి వెంకట్‌రెడ్డిలతో కలిసి పర్యటించారు. కొడంగల్ శివారులోని అప్పాయిపల్లిలో నిర్మించే మెడికల్, పశువైద్యకళాశాలలకు కేటాయించిన స్థలాన్ని పరిశీలించారు. అనంతరం కడా కార్యాలయంలో కలెక్టర్లతో అభివృద్ధి పనులపై సమీక్షించారు. కొడంగల్ నియోజకవర్గానికి మంజూరైన పనులను గుర్తించి పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. కొడంగల్ ప్రాంతంలో విద్య, వైద్యం, రోడ్లు, వ్యవసాయం తదితర అంశాలపై అధికారులతో చర్చించారు. నియోజకవర్గానికి మంజూరైన పనులను ప్రణాళిక బద్ధంగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి నియోజకవర్గం కావడంతో అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అందుకనుగుణంగా పనులను వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. జిల్లాలో జరుగుతున్న ఫ్యామిలీ డిజిటల్ కార్డు సర్వేపై అధికారులతో అడిగి తెలుసుకున్నారు. సర్వేలో ఎలాంటి తప్పిదాలకు తావు ఇవ్వకుండా కుటుంబాల సమగ్ర వివరాలను సేకరించాలన్నారు. కార్యక్రమంలో తాండూరు సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్, వివిధ శాఖల అధికారులు, తహసీల్దార్ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

ఘట్‌కేసర్ సీఐ సస్పెన్షన్

హత్య కేసులో వచ్చిన ఆరోపణల నేపథ్యంలో వేటు



సీఐ సైదులు

ఘట్‌కేసర్ రూరల్, అక్టోబరు 5 : ఓ హత్య కేసులో ప్రధాన నిందితుడిని తప్పించినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ఘట్‌కేసర్ సీఐ సైదులును శనివారం రాచకొండ పోలీసు కమిషనర్ (సీపీ) సుధీర్‌బాబు సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఏడాది జూన్ 15న ఘట్‌కేసర్ మాజీ ఎంపీటీసీ గడ్డం మహేశ్ హత్యకు గురయ్యారు. హత్యకేసు దర్యాప్తులో భాగంగా సీఐ సైదులు నిందితులతో పాటు హత్యకు సహకరించిన ఆరుగురిని రిమాండ్‌కు తరలించారు. హత్య కేసులో ప్రధాన నిందితుడిని కేసు నుంచి తప్పించారని మృతుడి బంధువులు ఇటీవల సీపీకి ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు ఆధారంగా సీఐ సైదులును సస్పెండ్ చేస్తూ సీపీ ఆదేశాలు జారీ చేశారు. ఘట్‌కేసర్ పోలీసుస్టేషన్‌లో సైదులు సీఐగా ఆరు నెలలు విధులు నిర్వహించారు.

ఆరుగాలం కష్టించే రైతన్నలకు అడుగడుగునా కష్టాలు తప్పడం లేదు. ఏటా అతివృష్టి, అనావృష్టితో పంటలు దెబ్బతింటున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. ప్రకృతి వైపరీత్యాలకు నష్టపోతున్న రైతులను ఆదుకునేందుకు గతంలో అమలు చేసిన పంటల బీమా పథకం విషయంలో ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయి. పాలకులు, ప్రభుత్వాలు మారినా అన్నదాతలను పట్టించుకున్న పాపానపోవడం లేదు. గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే పంటల బీమాను పూర్తిస్థాయిలో అమలు చేస్తామని, రైతులపై ఎలాంటి ఆర్థిక భారం పడకుండానే బీమా మొత్తం తామే చెల్లిస్తామని ప్రకటించింది. అయితే కొత్తగా రాష్ట్రంలో అధికారం చేపట్టిన కాంగ్రెస్ కూడా అదే ధోరణి కనపరుస్తోంది. మరో వైపు ప్రభుత్వం పంటల బీమా మార్గదర్శకాలు ఇప్పటి వరకు విడుదల చేయలేదు. దీంతో అన్నదాతల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది.



రైతుకు ఏదీ ధీమా?

ఫసల్ బీమా అమలు ఎప్పుడో

- పంటల బీమా పట్టని సర్కారు
- ముగిసిన వానాకాలం సీజన్
- యాసంగికైనా బీమా అమలు చేసేనా?
- ఉమ్మడి జిల్లాలో ఏటా వేలాది ఎకరాల్లో పంట నష్టం
- మార్గదర్శకాలు విడుదల చేయని ప్రభుత్వం
- అన్నదాతలకు తప్పని ఎదురుచూపులు

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి జిల్లా/వికారాబాద్/మేడ్చల్ ప్రతినిధి)

ప్రకృతి వైపరీత్యాల కారణంగా ప్రతి ఏటా ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో వేలాది మంది రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. అతివృష్టి, అనావృష్టి, వడగళ్ల వర్షాలకు నష్టపోయిన రైతులకు ప్రభుత్వం నుంచి అంతంత మాత్రంగానే సాయం అందుతోంది. ప్రకృతి వైపరీత్యాలకు నష్టపోతున్న రైతులను ఆదుకునేందుకు గతంలో అమలు చేసిన పంటల బీమా పథకం విషయంలో ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయి. దీంతో అన్నదాతల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. వాస్తవానికి ప్రకృతి విపత్తుల వల్ల నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు కేంద్రం ఫసల్ బీమాయోజన పథకాన్ని అమలు చేస్తున్న విషయం తెలిసిందే. అయితే ఇది రాష్ట్రంలో అమలు కావడంలేదు. ఫసల్ బీమా యోజన పథకం అమలుకు బీమా కంపెనీకి ప్రీమియం చెల్లించేందుకు గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ముందుకు రాలేదు.

విడుదల కాని మార్గదర్శకాలు

వానాకాలం సీజన్ ముగిసినా కూడా ఫసల్ బీమా పథకం అమలుకు సంబంధించిన మార్గదర్శకాలు ఇంకా విడుదల చేయలేదు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఉమ్మడి జిల్లాలో దాదాపు రెండున్నరవేల ఎకరాల్లో పంట నష్టం జరిగింది. ప్రభుత్వం వీరికి ఎకరానికి రూ.10వేల చొప్పున పరిహారం అందిస్తామని ప్రకటించింది. అధికారులు నష్టపోయిన పంట వివరాలను ప్రభుత్వానికి నివేదించారు. అయితే ఇంతవరకూ జిల్లాలో పంట నష్టపరిహారం రైతులకు అందలేదు. మరో వైపు ప్రభుత్వం నుంచి పంటల బీమా మార్గదర్శకాలు ఇప్పటి వరకు విడుదల కాలేదు.

యాసంగిలోనైనా...

వానాకాలం సీజన్ ముగిసినా కూడా పంటల బీమా పథకంపై ఎలాంటి కదలిక రాలేదు. యాసంగి సీజన్‌కైనా పంటల బీమా అమలు చేస్తారేమోనని రైతులు ఆశగా ఎదురుచూస్తున్నారు. ఈ వానాకాలం సీజన్‌లో అతివృష్టి వల్ల రైతులు నష్టపోయారు. త్వరలో ఈశాన్య రుతుపవనాలు రానున్నాయి. యాసంగి పంటలకు ఇవే ఆధారం. అయితే ఈసారి ఈశాన్య రుతపవనాలు ఆగమన సమయంలో భారీ తుఫానులు ఏర్పడవచ్చని వాతావరణ శాఖ అంచనా వేసింది. అక్టోబరు నెలాఖరులో, నవంబరు ఆరంభంలో తుఫాన్లు వచ్చే ప్రమాదం ఉందని ఇటీవల హెచ్చరికలు చేసింది. దీంతో ఈశాన్య రుతుపవనాల సమయంలో ఏర్పడే తుఫానుల వల్ల మళ్లీ నష్టం జరుగుతుందోమోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. గత ఏడాది పంటలు చేతికందే సమయానికి మిగ్‌జాం తుఫాన్ కారణంగా వేలాది ఎకరాల్లో పంటనష్టం జరిగింది. ఉమ్మడి జిల్లాలో 11,500 ఎకరాల పంటలు దెబ్బతిన్నాయి. వివిధ పంటలు వేసిన రైతులు దాదాపు 8వేల మంది నష్టపోయారు. ఎన్నికల కోడ్ కారణంగా దీనికి సంబంధించిన పంట నష్టపరిహారం సకాలంలో అందక రైతులు ఇబ్బందులు పడ్డారు. దీంతో యాసంగి సీజన్‌లో పెట్టుబడులకు ఇబ్బందులు పడ్డారు. తరువాత యాసంగి సీజన్‌లో కూడా వడగళ్ల వర్షాలు. అతివృష్టి వల్ల ఉమ్మడి జిల్లాలో దాదాపు 3 వేల ఎకరాల్లో వివిధ పంటలు దెబ్బతిన్నాయి. వీరికి కూడా అరకొర పంటనష్టం అందింది. ఈ వానాకాలం సీజన్‌లో కూడా దాదాపు రెండున్నరవేల ఎకరాల పంట నష్టం జరిగింది. కొన్ని జిల్లాలకు పంట నష్టపరిహారం విడుదల చేసినా ఇంత వరకూ ఉమ్మడి జిల్లా రైతులకు పరిహారం అందలేదు. పంటల బీమా ఉంటే రైతులకు ధీమా ఉండేది. కానీ ప్రభుత్వం మారినా కూడా రైతుల కష్టాలు తీరడం లేదు.పంటల బీమా పథకం అమలుకు ఈఏడాది కూడా రైతులు ఎదురుచూడాల్సిన పరిస్థితి ఏర్పడింది.

అధికారంలోకి వచ్చి..

కేంద్రం ప్రవేశపెట్టిన ఫసల్ బీమా పథకం కింద కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 40శాతం చొప్పున ప్రీమియం చెల్లించాల్సి ఉంది. అలాగే రైతులు తమ వాటా కింద 20శాతం చెల్లించాలి. అప్పట్లో బీఆర్‌ఎస్ ప్రభుత్వం 40శాతం వాటా చెల్లించేందుకు ఆసక్తి చూపలేదు. రైతుబంధు కింద రైతులకు నేరుగా ఆర్థిక సహాయం అందిస్తున్నందున బీమాపథకం అవసరం లేదన్నట్లుగా వ్యవహరించింది. పంటనష్టాన్ని ఎంతో కొంత చెల్లించి ప్రభుత్వం చేతులు దులుపుకుంది. అయితే గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే పంటల బీమాను పూర్తిస్థాయిలో అమలు చేస్తామని హామీ ఇచ్చింది. సమగ్ర పంటల బీమాను అమల్లోకి తెస్తామని రైతులపై ఎలాంటి ఆర్థిక భారం పడకుండానే బీమా మొత్తం తామే చెల్లిస్తామని ప్రకటించింది. అయితే కొత్తగా రాష్ట్రంలో అధికారం చేపట్టిన కాంగ్రెస్ కూడా అదే ధోరణి కనపరుస్తోంది. అధికారంలోకి వచ్చి దాదాపు 10నెలలు గడిచినా కూడా అదిగో ఇదిగో అంటూ కాలయాపన చేస్తూనే ఉంది. దీంతో ప్రకృతి వైపరీత్యాలతో నష్టపోతున్న రైతులను ఆదుకునే మార్గాలు కనిపించడం లేదు.

సీఎంపై తిరుగుబాటు తప్పదు

- ఫోర్త్‌సిటీకి అసైన్డ్ భూములు లాక్కుంటే ఊరుకోం
- ఢిల్లీ నేతల జేబులు నింపడానికే పేదల ఇళ్ల కూల్చివేత
- కందుకూరులో మొదలైన ఆందోళన జిల్లా అంతటా వ్యాపిస్తుంది
- బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



రైతు ధర్నాలో మాట్లాడుతున్న కేటీఆర్

రంగారెడ్డి అర్బన్/కందుకూరు/మహేశ్వరం, అక్టోబరు 5 : ఫోర్త్‌సిటీ పేరుతో రైతులను బెదిరించి అసైన్డ్ భూములను లాక్కోవాలని చూస్తున్నారని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. కందుకూరులో నిర్వహించిన రైతు ధర్నాలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఫార్మాసిటీ కోసం సేకరించిన భూములను వేరే అవసరాలకు వాడితే కోర్టు ఒప్పుకోదన్నారు. అందుకే కోర్టును కూడా రేవంత్‌రెడ్డి మోసం చేసే ప్రయత్నం చేస్తున్నారన్నారు. కందుకూరులో మెడికల్ కాలేజీ నిర్మాణానికి గత ప్రభుత్వం రూ.200 కోట్లు మంజూరు చేస్తే సబితక్క, కేసీఆర్‌పై ఉన్న కోపంతో ఆ నిధులను కాంగ్రెస్ ప్రభుత్వం రద్దు చేసిందని ఆరోపించారు. ఢిల్లీ జేబులు నింపడానికే పేదల ఇళ్లను కూలగొడుతున్నారని ఆరోపించారు. చిట్టినాయుడు (రేవంత్) ఈ దిక్కుమాలిన పనులు మానుకోవాలని.. లేదంటే ప్రజలు, రైతులు తిరగబడే రోజు వస్తదని హెచ్చరించారు. కందుకూరులో మొదలైన ఈ ధర్నా.. మొత్తం జిల్లా అంతటా పాకుతుందన్నారు. ఇదే స్ఫూర్తితో మిగితా నియోజకవర్గాల్లోనూ ధర్నాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ ఉప ముఖ్యమంత్రి మహమూద్ అలీ, ఎమ్మెల్సీలు వాణిదేవి, శంభీపూర్ రాజు, నవీన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, అంజయ్య యాదవ్, జైపాల్ యాదవ్, మెతుకు ఆనంద్, పట్నం నరేందర్‌రెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్, రజని సాయిచంద్, క్యామ మల్లేష్, దేవేందర్, రాజు నాయక్ పాల్గొన్నారు. రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీలను అమలు చేసేంత వరకు వదిలే ప్రసక్తిలేదని మాజీ హోంమంత్రి సబితా ఇంద్రారెడ్డి అన్నారు. పదేళ్లలో మహేశ్వరం ప్రాంతం ఏవిధంగా అభివృద్ధి జరిగిందో అందరికీ తెలుసన్నారు. "రేవంత్‌రెడ్డి.. పంద్రాగస్టు ఇంకా రాలేదా...? 40 లక్షల మంది రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేస్తానన్నావు.. ఏమైంది" అని ఆమె ప్రశ్నించారు. రైతు కూలీలకు, కౌలు రైతులకు ఇస్తానన్న రూ.12వేలు ఏమైందని నిలదీశారు. రేవంత్ వచ్చాక రియల్ ఎస్టేట్ పడిపోయిందన్నారు. "లక్ష ఉద్యోగాలు వచ్చేలా ఫాక్స్‌కాన్ కంపెనీ ఇక్కడకు తీసుకు వచ్చాం... ఇప్పుడు కంపెనీ పనులు దాదాపు పూర్తయ్యాయి. కేసీఆర్‌కు పేరు వస్తదని, రేవంత్‌రెడ్డి పర్యటనకు వచ్చే ప్రయత్నం చేస్తున్నారని" విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 10నెలలు అవుతున్నా ఒక్క కంపెనీ అయినా వచ్చిందా అని ఆమె మండిపడ్డారు. తన ముగ్గురి కొడుకులకు గెస్ట్‌హౌస్‌లు ఉన్నాయని చెబుతున్నారు. ఎక్కడున్నాయో సీఎం చెప్పాలన్నారు. "నాకు కూతురు కూడా ఉంది... ఆమె గెస్ట్ హౌస్ కూడా వెతికి పెట్టాలని" ఎద్దేవా చేశారు. గెస్ట్‌హౌస్‌లు ఎక్కడున్నాయో చెబితే.. కూల్చేందుకు తానే పర్మిషన్ ఇస్తానని తెలిపారు. బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. తాను తొమ్మిది మంది ముఖ్యమంత్రులను చూశాను కానీ.. రేవంత్ లాంటి దరిద్రమైన సీఎంను ఎప్పుడూ చూడలేదన్నారు. ఆరు గ్యారెంటీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. తన నియోజకవర్గంలో 9630 మందికి రుణ మాఫీ కావాల్సి ఉండగా 3800 మందికి మాత్రమే మాఫీ అయ్యిందన్నారు. ఎమ్మెల్సీ సురభీ వాణిదేవి మాట్లాడుతూ.. కాంగ్రెస్‌ది అధికార దాహం తప్పించి మరొకటి కాదన్నారు. రైతుల దృష్టి మళ్లించేందుకు హైడ్రా డ్రామాలు చేస్తున్నారని విమర్శించారు. యువ నేత కార్తీక్‌రెడ్డి మాట్లాడుతూ.. తనకు మూడు ఫామ్‌హౌసులు ఎక్కడ ఉన్నాయో సీఎం రేవంత్ చెప్పాలని డిమాండ్ చేశారు. కేసీఆర్‌కు నదులు ఎక్కడ ఉన్నాయో తెలిస్తే.. సీఎంకు ఫామ్‌హౌసులు ఎక్కడ ఉన్నాయో తెలుసని ఎద్దేవా చేశారు. పంద్రాగస్టు వరకు సంపూర్ణ రుణమాఫీ చేస్తానని మాట తప్పాడని విమర్శించారు. జీవో 111లో ఉన్న వ్యర్థాలు హిమాయత్‌సాగర్‌లోకి పోతున్నాయని తెలిపారు. మంత్రి జూపల్లి, సొంత అన్నది మూసీ పరీవాహక ప్రాంతంలో ఉన్నది రేవంత్‌కు కనిపించటం లేదా అని ఆయన ప్రశ్నించారు.



నాగుపల్లి అటవీప్రాంతంలో మట్టితో పూడుకు పోయిన చెక్‌డ్యాం

చెక్‌డ్యాంలు నిర్మించారు నిర్వహణ మరిచారు

పెద్దేముల్, అక్టోబరు 5: వర్షపునీటిని ఒడిసి పట్టి భూగర్భ జలాలు పెంపొందించేందుకు నిర్మించిన చెక్‌డ్యాంలు దిష్టిబొమ్మలుగా మారుతున్నాయి. జిల్లాలో నిర్మించిన చెడ్‌డ్యాంల నిర్వహణ అధికారులు, పాలకులు గాలికొదిలేసున్నారు. వాటిని నిర్మించిన ఉద్దేశం నెరవేరడం లేదు. చెక్‌డ్యాంల కోసం వెచ్చించిన నిధులు నిష్ఫలంగా మారిపోతున్నాయి. వర్షపునీరు వాగుల, వంకల ద్వారా వృథాగా పోతుంటాయి. అయితే వాటికి అడ్డుకట్ట కట్టి పరుగెడుతున్న నీటిని కొంత మేర నిలిపివేయడంతో సమీప ప్రాంతాల్లో భూగర్భ జలాలు పెంపొందుతాయనేది ముఖ్యఉద్దేశం. అధికారులు, పాలకులు నిర్మించే సమయంలో ఎంతో హడావిడి చేసి వాటికి నిధులు మంజూరు చేసి నిర్మాణాలు చేస్తున్నారు. ఆతరువాత అవి ఎలాఉన్నాయి. వాటి పనితీరెలా ఉందనే విషయాలను పట్టించుకోవడం లేదు. వాటివంక కన్నెత్తి చూడకపోవడంతో చెక్‌డ్యాంలు పూర్తిగా పూడుకుపోతున్నాయి. కొన్ని చోట్ల వాటికి గండ్లు పడి శిథిలమవుతున్నాయి. పూడుకుపోయిన చెక్‌డ్యాంలకు సుమారు ఐదారు వేలు వెచ్చిస్తే చాలు అవి తిరిగి ఉపయోగంలోకి వచ్చే అవకాశాలు ఉన్నా వాటిని పట్టించుకోవడం లేదు. శిథిలమైన వాటిని గుర్తించి మరమ్మతులు చేస్తే కొత్తవాటిలా ఉపయోగంలోకి వస్తాయి. భూగర్భ జలాలు కూడా పెరగనున్నాయి. మనం ఎన్ని కట్టామని కాకుండా, ఎన్ని చెక్‌డ్యాంలు వినియోగంలో ఉన్నాయని లెక్కలు తీయడం లేదు. ఉదాహరణకు పెద్దేముల్ మండలం నాగులపల్లి అటవీప్రాంతంలో తట్టెపల్లి వెళ్లే రోడ్డుపక్కనే చెక్‌డ్యాం నిర్మించారు. అది ఇప్పటికీ ధృడంగానే ఉంది. కానీ అందులో నీరునిలిచే లోపలి భాగం మొత్తం మట్టితో పూడుకుపోయింది. దీంతో అందులో నీరు నిలిచే పరిస్థితి లేకుండా పోయింది. వానలు కురిస్తే వరద వచ్చినా నీరంతా నిలవకుండానే వెళ్లిపోతోంది. ఇప్పటికైనా అధికారులు చెక్‌డ్యాంలను పరిశీలించి అవసరమైన వాటికి మరమ్మతులు చేయాలని పలువురు కోరుతున్నారు.

మల్కాజ్‌గిరి అభివృద్ధికి కృషి


పనులను ప్రారంభిస్తున్న ఎంపీ ఈటల, ఎమ్మెల్యే మల్లారెడ్డి

మేడ్చల్ టౌన్, అక్టోబరు 5 : మల్కాజ్‌గిరి పార్లమెంట్ నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాలను సమగ్రంగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. శనివారం గుండ్లపోచంపల్లి పరిధి పలు వార్డుల్లో రూ.7.73కోట్లతో చేపట్టిన పనులను ఎంపీ, స్థానిక ఎమ్మెల్యే మల్లారెడ్డి ప్రారంభిచారు. ఎంపీ మాట్లాడుతూ.. మల్కాజ్‌గిరి లోక్‌సభ స్థానం దేశంలోనే అతిపెద్ద నియోజకవర్గం అని, ఇక్కడ అభివృద్ధి కూడా పెద్దఎత్తునే జరగాల్సి ఉందన్నారు. ఇక్కడ రోజురోజుకూ జన నివాసాలు పెరుగుతున్నాయన్నారు. ఇక్కడుండే వారందరికీ మౌలిక సదుపాయాలు కల్పించే బాధ్యత పాలకులపైనే ఉందన్నారు. పనులు చేపట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం వద్ద నిధులు లేవని, అందుకే తాను కేంద్రం నుంచి నిధుల తెచ్చి ప్రజావసరపనులన్నీ పూర్తిచేసేలా కృషిచేస్తానని స్పష్టం చేశారు. ఎమ్మెల్యే మల్లారెడ్డి మాట్లాడుతూ.. గత ఐదేళ్లలో తాను మున్సిపాలిటీలు, కార్పొరేషన్‌లు, పంచాయతీల్లో కోట్లాది రూపాయలతో పనులు చేయించానని చెప్పారు. రోడ్డు సౌకర్యాలను మెరుగుపర్చానన్నారు. కౌన్సిలర్లు కూడా తమ వార్డులు, డివిజన్లలో పెండింగ్ పనులు పూర్తయ్యేలా కృషిచేయాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ మద్దుల లక్ష్మీశ్రీనివాస్‌రెడ్డి, కమిషనర్ ఎ.స్వామి, వైస్‌ఛైర్మన్ ప్రభాకర్, కౌన్సిలర్లు దొడ్ల మల్లికార్జున్, సాయిపేట శ్రీనివాస్, సరస్వతి, హేమంత్‌రెడ్డి, బాల్‌రాజ్, జైపాల్‌రెడ్డి, బీజేపీ రూరల్ జిల్లా అధ్యక్షుడు విక్రమ్‌రెడ్డి, నాయకులు అమరం మోహన్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జంగారెడ్డి, భాస్కర్‌రెడ్డి


కడ్తాల్ : మాట్లాడుతున్న గూడూరు శ్రీనివాస్‌రెడ్డి

రాజకీయ లబ్ధికే బీఆర్ఎస్ నాయకుల ధర్నా

కందుకూరు, అక్టోబరు 5: రాష్ట్రంలో రైతు రాజ్యం మళ్లీ వచ్చి అన్నదాతల కళ్లల్లో ఆనందం తెచ్చేలా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నా.. బీఆర్ఎస్ నాయకులు రాజకీయ లబ్ధికి ధర్నా చేయడం విడ్డూరంగా ఉందని పీసీసీ మెంబర్ దేప భాస్కర్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ బొక్క జంగారెడ్డిలు ఆరోపించారు. శనివారం సాయంత్రం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ నేతలతో కలిసి మాట్లాడారు. ఎన్నికలు జరిగిన కొద్ది రోజులకే రైతులకు ఏకకాలంలో రూ.2లక్షల రుణమాఫీ చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించడం సరికాదన్నారు. ఇచ్చిన హామీ మేరకు రేవంత్‌రెడ్డి మాఫీ చేశారని, రైతులు ఆయనకు కృతజ్ఞతలు తెలుపుతుంటే బీఆర్ఎస్ నాయకులు ధర్నాలు చేయడమేమిటన్నారు. వచ్చే ఎన్నికల్లో సబితాఇంద్రారెడ్డికి డిపాజిట్ కూడా దక్కదన్నారు. 201, 2023 ఎన్నికల్లో బీఆర్ఎస్ నాయకులు రైతులకు రుణమాఫీ ఎంతమందికి చేశారో చెప్పాలన్నారు. నాయకులు బొక్క భూపాల్‌రెడ్డి, రాణాప్రతాప్‌రెడ్డి, డిల్లీ శ్రీధర్, అమరేందర్‌రెడ్డి, లచ్చానాయక్, డి.నర్సింహాచారి, కప్పాటి పాండురంగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌ది అసత్య ప్రచారం

కడ్తాల్, అక్టోబరు 5: అధికారం కోల్పోయామన్న అక్కసుతో బీఆర్ఎస్ నాయకులు రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజారంజక పాలనను చూసి ఓర్వలేక విషం కక్కుతున్నారని డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ప్రజలు తిరస్కరించినా ఆ పార్టీ నేతల్లో మార్పు రాలేదని, అసత్య ప్రచారాలతో ప్రజలను తప్పుదోవ పట్టించి రాజకీయ లబ్ధికి యత్నిస్తున్నారని మండిపడ్డారు. మండల కేంద్రంలో శనివారం గిరిజన సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హన్మానాయక్, డీసీసీ ప్రధాన కార్యదర్శి బీక్యానాయక్, మండల మాజీ కో-ఆప్షన్ సభ్యుడు జహంగీర్‌బాబా, పీఏసీఎస్ డైరెక్టర్ వెంకటేశ్, జిల్లా నాయకులు గురిగళ్ల లక్ష్మయ్య, జహంగీర్‌అలీలతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ధర్నాలు, దీక్షల పేరుతో కొత్త డ్రామాలకు తెరలేపారని, ప్రభుత్వం రైతులకు మేలు చేస్తూ.. రాష్ట్రాభివృద్ధికి చర్యలు చేపడుతుంటే ఓర్వలేని కేటీఆర్, హరీశ్‌రావు, సబితారెడ్డిలు ప్రజలను రెచ్చగొట్టి రాజకీయ పబ్బం గడుపుకోవడానికి కుట్రలు సాగిస్తున్నారని ఆరోపించారు. హైడ్రా ద్వారా చెరువు కుంటల్లో ఆక్రమణలు తొలగిస్తుంటే, మూసీ సుందరీకరణకు చర్యలు చేపడుతుంటే ఎక్కడ కాంగ్రెస్‌కు పేరు వస్తుందోనని బీఆర్ఎస్ నాయకులు రోడ్లపై పడి ప్రజలను రెచ్చగొడుతున్నారని అన్నారు.

గురుకులంలో ఖాళీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

కొడంగల్ రూరల్, అక్టోబరు 5: పాతకొడంగల్‌లో ఉన్న గిరిజన గురుకుల పాఠశాలలో ఖాళీగా ఉన్న పోస్టులకు అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ శ్రీనివాసులు శనివారం తెలిపారు. పీజీటీ-మ్యాథ్స్ పీజీటీ-బయోసైన్సెస్, పీజీటీ-సోషల్ సైన్సెస్ ఒక్కో పోస్టు ఖాళీగా ఉన్నాయన్నారు. అభ్యర్థులు ఈ నెల 19వ తేదీకల్లా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఈ నెల 21న మానసహిల్స్, రాజేంద్రనగర్‌లో డెమో, ఇంటర్వ్యూ ఉంటాయని తెలిపారు. అభ్యర్థులు ఆయా సబ్జెక్టుల్లో పీజీ, బీఎడ్ పూర్తి చేసి ఉండాలన్నారు.

గీత కార్మికులకు కిట్ల అందజేత



మేడ్చల్, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): జిల్లా బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శనివారం మల్కాజిగిరి, మేడ్చల్ నియోజకవర్గాల కల్లు గీత కార్మికులకు సేఫ్టీ కిట్లు అందజేశారు. ఎమ్మెల్యే మల్లారెడ్డి నివాసం వద్ద కిట్లను అందజేశారు. మల్లారెడ్డి మాట్లాడుతూ కల్లుగీత కార్మికులు చెట్లపై నుంచి జారిపడి మృత్యువాత పడుతున్నారని, కొందరు వికలాంగులుగా మారుతున్నారని, ఇలాంటి ప్రమాదాలు జరుగకుండా తాటి చెట్లు ఎక్కేందుకు కాటమయ్య రక్షణ కవచాన్ని ప్రభుత్వం అందజేస్తోందన్నారు. ఈ పరికరాన్ని ధరించి చెట్లు ఎక్కితే జారిపడే ఆస్కారమే ఉండదన్నారు. ఈ కిట్లను గీత కార్మికులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో బీసీ వెల్ఫేర్ అధికారి కేశూరాం, రాజేశ్వర్, ముజహిద్, శ్రీనివాస్, కమల్‌రాజ్ పాల్గొన్నారు.

డోరు మూసుకోక నిలిచిన ఎలక్ట్రిక్ బస్సు

గంటపాటు మేడ్చల్ హైవేపై ట్రాఫిక్ జామ్


నిలిచిన ఎలక్ట్రిక్ బస్సు

మేడ్చల్ టౌన్, అక్టోబరు 5: ఆర్టీసీలో కొత్తగా ప్రవేశ పెట్టిన ఎలక్ట్రిక్ వెహికిల్(ఈవీ)లను నడపడం డ్రైవర్లకు సవాలుగా మారింది. అడ్వాన్స్‌డ్ టెక్నాలజీతో రూపొందించిన ఎలక్ట్రిక్ బస్సులను నడపడంపై అవగాహన లేక ఏదైనా లోపం తలెత్తితే ఏం చేయాలో తెలియక డ్రైవర్లు ఇబ్బందులు పడుతున్నారు. శనివారం మేడ్చల్‌లో ఇలాంటి ఘటనే చోటుచేసుకుంది. నిజామాబాద్ నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న ఈవీ సూపర్ లగ్జరీ బస్సు ఓ ప్రయాణికుడిని దించేందుకు మేడ్చల్ బస్టాండ్ వద్ద ఆగింది. ప్రయాణికుడు దిగిన వెంటనే తిరిగి డోర్ క్లోజ్ చేసేందుకు చూడగా హైడ్రాలిక్ పనిచేయక తలుపు మూసుకోలేదు. దీంతో బస్సు ముందుకు కదల్లేదు. రోడ్డు మధ్యలోనే నిలిచింది. డ్రైవర్, ప్రయాణికులు డోర్‌ను క్లోజ్ చేసేందుకు తంటాలు పడ్డా మూసుకోలేదు. రోడ్డు మధ్యలో బస్సు నిలవడంతో 3కిలోమీటర్ల మేరర వాహనాలు నిలిచాయి. ట్రాఫిక్ పోలీసులు చేరుకుని ట్రాఫిక్ క్లియరెన్స్‌కు తంటాలుపడ్డారు. చివరికి బస్సు డ్రైవర్ ఫోన్లో నిపుణులను సంప్రదించి బస్సును స్టార్ట్ చేసి అక్కడి నుంచి కదిలించాడు.

ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి


ఎమ్మెల్సీ కోదండరాంకు వినతిపత్రం ఇస్తున్న టీవీవీ నాయకులు

బొంరాస్‌పేట్, అక్టోబరు 5: ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ విద్యావంతుల వేదిక నాయకులు రవీందర్ గౌడ్, గౌరారం గోపాల్ కోరారు. శనివారం హైదరాబాద్‌లో ఎమ్మెల్సీ కోదండరాంకు వినతిపత్రం ఇచ్చారు. 2023 జూలై నుంచి పీఆర్సీ పెండింగ్‌లో ఉందని, వెంటనే పీఆర్సీ కమిటీ నివేదికపై ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలతో చర్చించి అధిక ఫిట్‌మెంట్‌తో పీఆర్సీని అమలు చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న 5డీఏలను విడుదల చేయాలని, అలాగే కొత్త జీవోతో దూర ప్రాంతాలకు బదిలీ అయిన సీనియర్ ఉద్యోగులకు న్యాయం చేయాలన్నారు. ఇందుకు కోదండరాం స్పందించి ఈ సమస్యలపై సీఎం రేవంత్‌రెడ్డితో చర్చిస్తానని హామీ ఇచ్చారని వారు తెలిపారు. కార్యక్రమంలో విజయ్‌కుమార్, జగదీశ్ పాల్గొన్నారు.

‘ఫార్మా’తో రైతులను ఇబ్బంది పెట్టొద్దు


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ డీకే.అరుణ

బొంరాస్‌పేట్, అక్టోబరు 5: పొలాల్లో ఫార్మా కంపెనీల ఏర్పాటుతో ప్రభుత్వం రైతులను ఇబ్బంది పెట్టొద్దని మహబూబ్‌నగర్ ఎంపీ డీకే.అరుణ అన్నారు. దుద్యాల మండలం హకీంపేట్‌లో ఫార్మా కంపెనీకి వ్యతిరేకంగా రైతులు చేపట్టిన దీక్షకు శనివారం ఆమె మద్దతు తెలిపారు. ఈ ప్రాంతం నుంచి ఎమ్మెల్యేగా గెల్చి సీఎం అయిన రేవంత్‌రెడ్డి రైతుల ఇబ్బందులను గుర్తించి ఫార్మా కంపెనీ ఏర్పాటు కాకుండా చూడాలన్నారు. ప్రజాభీష్టం మేరకే ప్రభుత్వం, పాలకులు నడచుకోవాలేగానీ, ప్రజలను ఇబ్బందులకు గురిచేసేలా పనులు ఎప్పుడూ చేయొద్దని హితవుపలికారు. కార్యక్రమంలో హకీంపేట్, పోలెపల్లి, పులిచర్లకుంట తండా, లగర్ల రైతులు, బీజేపీ నాయకులు పాల్గొన్నారు. అంతకుముందు ఎంపీ అరుణ పోలెపల్లిలో ఎల్లమ్మను దర్శించుకొని పూజలు నిర్వహించారు.

ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలి


అమరులైన ఆర్టీసీ ఉద్యోగులకు నివాళులర్పిస్తున్న నాయకులు

పరిగి, అక్టోబరు 5: ఆర్టీసీ ఉద్యోగులు చేసిన 55 రోజుల సమ్మెలో అమరులైన వారిని స్మరిస్తూ శనివారం టీజేఎంయూ ఆధ్వర్యంలో పరిగి డిపోలో అమర కార్మికుల చిత్రపటాలకు నివాళులర్పించారు. టీజేఎంయూ వ్యవస్థాపక ప్రధానకార్యదర్శి కె.హన్మంతు మాట్లాడుతూ.. ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ, 2019 అక్టోబరు ఐదు నుంచి 55రోజులు సమ్మె చేశారని తెలిపారు. ఆ సమయంలో రాష్ట్రవ్యాప్తంగా 38 మంది ఉద్యోగులు మరణించారని తెలిపారు. వారి ఆశయాలు సాధిస్తేనే వారికి నిజమైన నివాళి అన్నారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలని, కార్మికుల అపాయింట్‌మెంట్ తేదీని ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఆర్టీసీ ఎండీ సిబ్బందని పనిమనుషుల్లా వాడుకుంటున్నారని ఆరోపించారు. ఎండీ తీరుతో ప్రభుత్వమూ బద్నాం అవుతోందన్నారు. ఈ విషయంలో ముఖ్యమంత్రి వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు వెంకట్రాంలు, బి.కృష్ణ, శంషద్దీన్, ప్రసాద్, సురేష్, బాబు, వెంకటేశ్, జంగయ్య, సంజీవ్, యాదమ్మ, అరుణ, లక్ష్మి, మైబమ్మ, రఘు పాల్గొన్నారు.

సీఎంపై అనుచిత వ్యాఖ్యలు.. చేసిన వ్యక్తిపై కేసు


రమేష్

చౌదరిగూడ, అక్టోబరు 5: సోషల్ మీడియా వేదికగా సీఎం రేవంత్‌రెడ్డిపై ఓ వ్యక్తి అనుచిత వ్యాఖ్యలు (ఫొటో మార్ఫింగ్) చేయడంతో కటకటాలపాలయ్యాడు. ఈ సంఘటన కొందుర్గు మండల కేంద్రంలో చోటు చేసుకుంది. కొందుర్గు గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త కాశమోని రమేష్ పలు సందర్భాల్లో కాంగ్రెస్ పార్టీ, సీఎం రేవంత్‌రెడ్డిపై సోషల్ మీడియా వేదికగా వాట్సప్ గ్రూప్‌లో సీఎం ఫొటో మార్ఫింగ్ చేసి అనుచిత వ్యాఖ్యలు చేసినట్లు టాస్క్‌ఫోర్స్ పోలీసులు గుర్తించారు. ఈమేరకు రమేష్‌ను శుక్రవారం సాయంత్రం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. శనివారం నాంపల్లి కోర్టుకు తరలించగా సైబర్ క్రైమ్ చట్టం కింద పద్నాలుగు రోజులు రిమాండ్‌కు తరలించారు.

విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలి


ఫలితాలు విడుదల చేస్తున్న డాక్టర్ సాత్వికరెడ్డి

మొయినాబాద్ రూరల్, అక్టోబరు 5: విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేందుకు కష్టపడి చదవాలని చైతన్య డీమ్డ్ యూనివర్సిటీ చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ సాత్వికరెడ్డి తెలిపారు. శనివారం మండల పరిధి హిమాయత్ నగర్‌లోని యూనివర్సిటీలో పీజీ కోర్సుకు సంబంధించి రెండవ సెమిస్టర్ ఫలితాలను సాత్వికరెడ్డి అధ్యాపక బృందంతో కలిసి విడుదల చేశారు. 286 విద్యార్థులకు గాను 217 మంది ఉత్తీర్ణులైనట్లు సాత్వికరెడ్డి తెలిపారు. రిజిస్ట్రార్ ఆచార్య రవీందర్, ఆచార్య జగదీశ్వర్, డీన్ ఆచార్య రాజు, వివిధ శాఖాధిపతులతో పాటు పీఆర్వో గాదె రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

బండి సంజయ్‌ని కలిసిన బాబయ్య


బండి సంజయ్‌తో అందె బాబయ్య

షాద్‌నగర్ అర్బన్, అక్టోబరు 5: కేంద్ర మంత్రి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌ని బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు అందె బాబయ్య శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. కరీంనగర్‌లో దుర్గామాత దీక్షలో ఉన్న సంజయ్‌ని కలిసినట్లు బాబయ్య తెలిపారు. ఈ సందర్భంగా బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమంపై చర్చించారని, ప్రతీ బూత్‌లో 200లకు పైగా సభ్యత్వాలు చేసి, కార్యకర్తల్లో నూతన నేతృత్వాన్ని తీసుకురావాలని బండి సూచించినట్లు బాబయ్య తెలిపారు.

అమ్మవారికి ఇష్టపూజలు

ఘనంగా దేవీశరన్నవరాత్రి ఉత్సవాలు


ఘట్‌కేసర్‌లోని ఎన్ఎఫ్‌సీనగర్‌లో సీతారాముల కల్యాణం

ఘట్‌కేసర్/కీసర రూరల్/కీసర/మేడ్చల్ టౌన్/శామీర్‌పేట/ధారూరు/కొడంగల్, అక్టోబరు5: ఘట్‌కేసర్, పోచారం మున్సిపాలిటీల్లో శనివారం దేవీశరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారు వివిధ అలంకారాల్లో దర్శనమిచ్చారు. అన్నోజిగూడ గాయత్రీదేవి ఆలయంలో రాజరాజేశ్వరిగా, మున్సిపాలిటీ ఎన్ఎఫ్‌సీనగర్‌లోని రామాలయంలో అమ్మవారు పార్వతీదేవి అలంకారంలో పూజలు నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా సీతారాముల కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. ఎన్ఎఫ్‌సీనగర్‌లోని శివశంకరి వేదపీఠంలో గాయత్రీమాత అలంకారంలో పూజలు నిర్వహించారు. శనివారం సాముహిక కుంకుమార్చన పూజల్లో భారీగా


తూంకుంటలోని గాయత్రి క్షేత్రంలో అమ్మవారికి పూజలు


ధారూరులో అన్నపూర్ణాదేవీ అలంకరణలో అమ్మవారు


మేడ్చల్ టౌన్: గడీమైసమ్మను దర్శించుకుంటున్నతహసీల్దార్ శైలజ

మహిళలు పాల్గొన్నారు. కీసర మండలం నాగారం, దమ్మాయిగూడ మున్సిపాలిటీల్లో మండపాల్లో ప్రతిష్ఠించిన అమ్మవార్లకు పూజలు కొనసాగుతున్నాయి. అన్నపూర్ణదేవి అలంకారంలో పూజలు నిర్వహించారు. రంపల్లిలో అన్నప్రసాద వితరణ నిర్వహించారు. కీసరగుట్టలో శరన్నవరాత్రుల్లో భాగంగా శనివారం అమ్మవారు గాయత్రీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. మేడ్చల్‌లోని గడీమైసమ్మ ఆలయంలో చండీయాగం నిర్వహించారు. తహసీల్దార్ శైలజ, ఆఫీసు సిబ్బంది అమ్మవారిని దర్శించుకున్నారు. శామీర్‌పేట మండలం తూంకుంట పరిధి గాయత్రీదేవి మహాక్షేత్రంలో వ్యవస్థాపకులు డాక్టర్ ఎస్వీఎల్ఎన్ మూర్తి ఆధ్వర్యంలో శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. శనివారం అమ్మవారు మధురమీనాక్షిదేవిగా దర్శనమిచ్చారు. స్థానికులతో పాటు నగరంలోని వివిధ ప్రాంతాల భక్తులు అమ్మవారిని


కొడంగల్‌లో పూజలందుకుంటున్న దుర్గామాత

దర్శించుకున్నారు. ఉప్పరిపల్లిలో బీఆర్ఎస్ నాయకుడు లాలయ్య ఆధ్వర్యంలో ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. ధారూరులోని వీరభద్రేశ్వరాలయంలో ఉత్సవాలు కొనసాగుతున్నాయి. మహిళలు కుంకుమార్చన చేశారు. కొడంగల్‌లోని సిటిజన్ క్లబ్ ఆవరణలో ధర్మ పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన దుర్గామాతకు భక్తులు పూజలు నిర్వహించారు. ఆర్యనగర్ కాలనీలో దుర్గమాతకు నిత్య పూజలు చేస్తున్నారు.


ఎన్ఎఫ్‌సీనగర్‌లోని శివశంకరి వేద పీఠంలో సామూహిక కుకుమార్చన పూజల్లో పాల్గొన్న మహిళలు

ఇళ్లకు తాళంవేసి ఊళ్లకెళ్తే జాగ్రత్తలు తీసుకోవాలి


సీఐ సత్యనారాయణ

మేడ్చల్ టౌన్, అక్టోబరు 5: దరసరా పండుగ సందర్భంగా పట్టణాల్లో ఉన్న వారు గ్రామాలకు, ఇతర చోట్లకు వెళ్తే ఇంట్లోని ఆస్తుల రక్షణకు తగు జాగ్రత్తలు తీసుకోవాలని మేడ్చల్ సీఐ సత్యనారాయణ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. ఇంటికి తాళం వేసి వెళ్లే వారు చోరీలు జరగకుండా చూసుకోవాలన్నారు. పక్కింటి వారికి లేదా కాలనీ సొసైటీలకు సమాచారం ఇవ్వాలన్నారు. ఇళ్లలో నగదు, బంగారం, ఇతర విలువైన వస్తువులు ఉంచకుండా వెంట తీస్కుపోవడమో లేదా బ్యాంకుల్లో భద్రపర్చుకోవడమో చేయాలన్నారు. కాలనీల్లో అనుమానితులు తిరిగితే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. తాము కూడా కాలనీల్లో నిఘా ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఎక్కువ రోజులు ఇళ్లకు తాళం వేసే వారు పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

పురుగుమందుల పిచికారీపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న ఏఈవో సంజూ

ధారూరు, అక్టోబరు 5: పంటలపై పురుగుమందులను పిచికారి చేసేటప్పుడు రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని ఏఈవో సంజూరాథోడ్ తెలిపారు. గురుదోట్ల రైతు వేదికలో శనివారం పురుగుల మందుల వాడకం, పిచికారీపై క్లస్టర్ రైతులకు ఆయన అవగాహన కల్పించారు. మందుల పిచికారీ సమయంలో రైతులు మోకాలి వరకు బూట్లు, చేతులకు గ్లౌస్‌లు, నోటికి మాస్క్, కళ్లకు అద్దాలు, తలకు టోపీ విధిగా ధరించాలన్నారు. కాళ్లకు, చేతులకు కొబ్బరినూనె రాసుకోవాలని తెలిపారు. గాలివాటానికి ఎదురుగా పంపుతో స్ర్పే చేయొద్దన్నారు. పురుగు మందుల డబ్బాలపై బ్లూ లేబుల్ ఉంటే మధ్యస్థ పూరితమని, అదే పసుపు రంగులో ఉంటే అత్యంత విషపూరితమని, ఎరుపు రంగులో ఉంటే చాలా విషపూరితమైన పురుగుల మందుగా గుర్తించాలన్నారు. ముందు నోట్లోకి వెళ్లకుండా జాగ్రత్త పడ్డాలన్నారు. పిచికారి అనంతరం చేతులను సబ్బుతో శుభ్రంగా కడుక్కోవాలని ఆయన వివరించారు.

జొన్నసాగుపై రైతులతో చర్చాగోష్టి

దౌల్తాబాద్, అక్టోబరు 5: యాసంగిలో ఆరుతడి పంటగా పండించే తెల్లజొన్న సాగు రైతులకు ఎంతో లాభాదాయకమని తాండూర్ వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ శేఖర్ తెలిపారు. శనివారం దౌల్తాబాద్ మండలంలోని బిచ్చాల్ గ్రామంలో రైతులతో చర్చాగోష్టి నిర్వహించారు. తెల్ల జొన్న నూతన రకం 55, మలదండి రకంతో పోల్చితే అందుకు దీటుగా బెట్ట పరిస్థితులు తట్టుకొని కాండం కుళ్లు తట్టుకునే రకం అని వివరించారు. అధిక గింజ, చొప్ప వస్తుందని తెలిపారు. తాండూర్ వ్యవసాయ పరిశోధన కేంద్రంలో తెల్లరకం జొన్న రైతులకు అందుబాటులో ఉందని, కిలో రూ.90కి అందిస్తున్నామని తెలిపారు. రైతులు వీటిని వేయాలని సూచించారు. అదే విధంగా కంది, పత్తి పంటల సాగులో చీడ పీడల నివారణకు సలహాలు, సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో బుగ్గప్ప, అనిల్, సంజీవ్, ప్రకాశ్, అబ్యుదయ జొన్న సాగుదారులు పాల్గొన్నారు.

ఫ్యామిలీ డిజిటల్ కార్డు సర్వేలో పూర్తి వివరాలుండాలి


పరిగిలో సర్వేను పరిశీలిస్తున్న ఆర్డీవో వాసుచంద్ర

పరిగి, అక్టోబరు 5: ప్రభుత్వం చేపట్టిన ఫ్యామిలీ డిజిటల్ కార్డు సర్వేలో కుటుంబాల పూర్తి వివరాలుండాలని వికారాబాద్ ఆర్డీవో ఎం.వాసుచంద్ర అన్నారు. పరిగిలోని 13వ వార్డులో శనివారం కార్డు సర్వేను ఆయన పరిశీలించారు. ఆర్డీవో మాట్లాడుతూ.. ఆధార్ కార్డు మాదిరిగానే ఫ్యామిలీ డిజిటల్ కార్డు ప్రజలకు ఉపయోగపడనుందని తెలిపారు. కుటుంబీకుల వివరాలన్నీ ఒకే కార్డులో ఉంటాయని తెలిపారు. సిబ్బంది ఇంటింటికి వెళ్లి వివరాలు పక్కాగా సేకరిస్తారని చెప్పారు. వివరాల నమోదులో ఎలాంటి తప్పులు చేయొద్దని ఉద్యోగులకు ఆయన సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఆనంద్‌రావు, కమిషనర్ వెంకటయ్య పాల్గొన్నారు.

దోమ: మండలంలోని ఖమ్మం నాచారంలో కొనసాగుతున్న ఫ్యామిలీ డిజిటల్ కార్డు సర్వేను తహసీల్దార్ పురుషోత్తం, ఎంపీడీవో మహేశ్ బాబు పరిశీలించారు. గ్రామంలో ఇప్పటి వరకు 110 కుటుంబాలను సర్వే చేసి వివరాలు సేకరించామని తెలిపారు. సేకరించిన కుటుంబీకుల పేర్లన్నీ ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తామన్నారు. అన్ని వివరాలతో ప్రభుత్వం స్మార్ట్ కార్డును ఇస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

సీసీఐ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి


మేనేజర్ అమిత్‌రంజన్‌కు వినతిపత్రం అందజేస్తున్న మాజీ ఎంపీపీ, కార్మికులు

తాండూరు రూరల్, అక్టోబర్ 5 : సీసీఐ కార్మికుల సమస్యలు పరిష్కరించి వీడీఏ అమలు చేయాలని కరన్‌కోట్ మాజీ ఎంపీటీసీ రాజ్‌కుమార్ కోరారు. శనివారం సీసీఐ సిమెంటు ప్యాకింగ్ ప్లాంట్ కార్మికుల జనరల్ బాడీ సమావేశాన్ని మాజీ ఎంపీటీసీ రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కర్మాగారంలో పని చేస్తున్న కార్మికుల సమస్యలను యాజమాన్యం పరిష్కరించాలన్నారు. స్కిల్డ్ లేబర్‌కు రోజుకు రూ.783, సెమీస్కిల్డ్‌కు రూ.868, స్కిల్డ్ లేబర్‌కు రూ.1,035 ఇవ్వాలని డిమాండ్ చేశారు. వేరియబుల్ డియర్‌నెస్ అలవెన్స్(వీడీఏ)ను అమలుచేసి, పెండింగ్‌లోని గ్రాట్యుటీని ఇవ్వాలన్నారు. 60మంది కార్మికుల గ్రాట్యూటీ పెండింగ్‌లో ఉందన్నారు. అనంతరం కార్మికులతో కలిసి కర్మాగారం పర్సనల్ మేనేజర్ అమిత్ రంజన్‌కు వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ జర్నప్ప, ప్యాకింగ్ ప్లాంట్ వర్కర్స్ యూనియన్ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించిన ఆర్డీవో

పూడూరు, అక్టోబర్ 5 : పూడూరు తహసీల్దార్ కార్యాలయాన్ని ఆర్డీవో వాసుచంద్ర సందర్శించారు. శనివారం కార్యాలయాన్ని సందర్శించిన ఆర్డీవో రికార్డులు పరిశీలించారు. తహసీల్దార్ భరత్‌గౌడ్‌తో మాట్లాడుతూ రికార్డులపై అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట సిబ్బంది తదితరులు ఉన్నారు.

పేదలకు వెంకటస్వామి సేవలు మరువలేనివి


వికారాబాద్‌లో వెంకటస్వామి చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న అధికారులు

వికారాబాద్/కీసర రూరల్/ఘట్‌కేసర్/దోమ/పరిగి, అక్టోబర్ 5: ప్రభుత్వ ఆదేశాల మేరకు కేంద్ర మాజీ మంత్రి, మాజీ ఎంపీ గడ్డం వెంకటస్వామి జయంతిని కలెక్టరేట్‌లో శనివారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి కలెక్టర్ ప్రతీక్‌జైన్, అదనపు కలెక్టర్లు లింగ్యానాయక్, సుధీర్, ట్రైనీ కలెక్టర్ ఉమాహారతి పూలమాలలు వేశారు. కలెక్టర్ మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర మంత్రిగా, ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ పదవులతో బడుగు వర్గాలకు కాకా ఎన్నో సేవలందించారని తెలిపారు. కార్యక్రమంలో ఎస్సీ వెల్ఫేర్ అధికారి మల్లేశం, డీపీఆర్‌వో చెన్నమ్మ, ఎస్సీ కార్పొరేషన్ బాబుమోజస్, ఏవో పర్వీన్ ఖాతూన్ పాల్గొన్నారు. అలాగే జిల్లా పోలీస్ కార్యాలయంలో అదనపు ఎస్పీ యు.రవీందర్‌రెడ్డి, ఆర్ఐ డేవిడ్, డీపీవో సిబ్బంది నిర్వహించారు. వెంకటస్వామి చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. వెంకటస్వామి జయంతిని కీసర మండలం నాగారం, దమ్మాయిగూడల్లో నిర్వహించారు. నాగారం, దమ్మాయిగూడ మున్సిపల్ చైర్మన్లు చంద్రారెడ్డి, ప్రణిత, వైస్‌చైర్మన్లు మల్లేష్‌యాదవ్, నరేందర్‌రెడ్డి, కమిషనర్ నాగమణి, మేనేజర్లుచంద్రశేఖర్, వెంకటేశం, కౌన్సిలర్లు పాల్గొన్నారు. రాష్ట్ర సాధనలో వెంకటస్వామి కృషి మరువలేనిదని పోచారం మున్సిపల్ చైర్మన్ కొండల్‌రెడ్డి అన్నారు. కార్యాలయం వద్ద వెంకటస్వామి చిత్రపటానికి నివాళులర్పించారు. ఘట్‌కేసర్ మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ పావని నివాళులర్పించారు. కమిషనర్లు వీరారెడ్డి, సాబేర్‌అలీ కౌన్సిలర్లు పాల్గొన్నారు. దోమ మండల పరిషత్‌లో వెంకటస్వామి జయంతిని నిర్వహించారు. అధికారులు ఆయన చిత్రపటానికి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఎంపీడీవో మహేశ్ బాబు, ఎంపీవో సోమలింగం, నరేందర్, ఏపీవో దస్తయ్య, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


నివాళులు అర్పిస్తున్న నాగారం మున్సిపల్ చైర్మన్ చంద్రారెడ్డి, తదితరులు

రూ.1.54కోట్లతో బీటీ రోడ్డు పనులు

బొంరాస్‌పేట్, అక్టోబరు 5 : మండలంలోని మెట్లకుంట పరిధిలోని భోజనగడ్డ, మైసమ్మతండాలకు రూ.1 కోటీ 54 లక్షలతో బీటీ రోడ్డు పనులను కాంగ్రెస్ నాయకులు శనివారం ప్రారంభించారు. రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని తెలిపారు. పనుల్లో నాణ్యత పాటిస్తూ త్వరితగతిన పూర్తిచేయాలని సంబంధిత కాంట్రాక్టర్‌కు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్‌రెడ్డి, సీనియర్ నాయకులు వెంకట్రాములు గౌడ్, అంజిల్‌రెడ్డి, నర్సిములునాయుడు, గోవర్ధన్‌రెడ్డి, మల్లికార్జున్, కుమ్మరి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నిషేధిత వస్తువులు అమ్మితే చర్యలు

మోమిన్‌పేట్, అక్టోబరు 5: నిషేధిత వస్తువులు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని మోమిన్‌పేట్ సీఐ నవీన్‌కుమార్ అన్నారు. శనివారం పోలీస్‌స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడారు. గుట్కాలు, జూదాం, గంజాయి, మత్తు పదార్థాలు కొకైన్ లాంటి వస్తువులను విక్రయిస్తే దుకాణ యజమానులపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అదే విధంగా ఆన్‌లైన్ బెట్టింగ్, సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లోని కిరాణ దుకాణాలు, పాన్‌షాపుల్లో గుట్కాలు, మత్తుపదార్థాలు ఎక్కువగా వాడుతున్నారని, యువత భవిష్యత్తును నాశనం చేసుకోవద్దన్నారు. దసరా తర్వాత ప్రజలకు అవగాహన సదస్సులు నిర్వహిస్తామన్నారు.

క్రీడల్లో గెలుపోటములు సహజం


క్రికెట్ టోర్నీని ప్రారంభిస్తున్న రితికొరెడ్డి

దోమ, అక్టోబరు 5:క్రీడల్లో గెలుపోటములు సహజం అని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి తనయకుడు రితిక్‌రెడ్డి అన్నారు. శనివారం తిమ్మాయిపల్లిలో క్రికెట్ టోర్నమెంట్‌ను ఆయన ప్రారంభించారు. క్రీడా పోటీల్లో అంపైర్‌దే తుదినిర్ణయం ఉంటుందని, క్రీడాకారులు శాంతియుతంగా పోటీలు కొనసాగించాలని తెలిపారు. నాయకులు రాఘవేందర్‌రెడ్డి, యాదయ్యగౌడ్, బాబర్, క్రీడాకారులు పాల్గొన్నారు.

'కేర్ ఆన్ వీల్స్' వైద్యసేవలు అభినందనీయం

శామీర్‌పేట, అక్టోబరు 5: 'కేర్ ఆన్ వీల్స్' హెల్త్ కేర్ వైద్య సేవలను ప్రజలు వినియోగించుకోవాలని జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి రఘునాథస్వామి అన్నారు. శనివారం కొల్తూర్‌లోని బయోలాజికల్ ఇ-లిమిటెడ్(బీఈ) ఫార్మా కంపెనీ వద్ద నిర్వహించిన కార్యక్రమానికి డీఎంఅండ్‌హెచ్‌వో ముఖ్య అతిథిగా హాజరై బీఈ, ఎస్ఈ-2 కంపెనీలు, డాట్ల, ఇంపాక్ట్ గురు ఫౌండేషన్లు చేపట్టే 'కేర్ ఆన్ వీల్స్' ఉచిత వైద్యసేవలు, మందుల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రజలకు ఉచితంగా వైద్యసేవలనందించడం అభినందనీయమన్నారు. ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టీ తిశన్యరాజు మాట్లాడుతూ బీఈ, ఎస్ఈ-2 ఫార్మా వారు ఇక నిరంతరం ప్రజలకు వైద్యసేవలు, ముందులిస్తారని తెలిపారు. మేడ్చల్, సంగారెడ్డి, రంగారెడ్డి జిల్లాల్లోని దాదాపు 30 గ్రామాల్లో ఉచిత వైద్య సేవలందిస్తామని పేర్కొన్నారు. ఇంపాక్ట్ గురు ఫౌండేషన్ సీఈఓ సందీప్‌తల్వార్ మాట్లాడుతూ గ్రామీణులకు వైద్య సేవలను అందుబాటులోకి తేవడం సంతోషంగా ఉందన్నారు. రెండు కేర్ ఆన్ వీల్స్‌తో శామీర్‌పేట, ఘగన్‌పహాడ్, పటాన్‌చెరువు ప్రాంతాల్లో వైద్య సేవలందిస్తామని చెప్పారు.



'కేర్ ఆన్ వీల్స్' సేవలకు జెండాఊపుతున్న డీఎంఅండ్‌హెచ్‌వో రఘునాథస్వామి

ఉపాధి పనుల్లో భారీగా అవకతవకలు


పనుల్లో అవినీతిపై అధికారులను నిలదీస్తున్న ప్రజలు

ధారూరు, అక్టోబరు 5: ఉపాధి హామీ పనుల్లో భారీగా అవకతవకలు జరిగాయని సామాజిక తనిఖీలో అధికారులను నాగసమందర్ గ్రామస్థులు నిలదీశారు. మండల పరిషత్తు ఆవరణలో శనివారం రాత్రి వరకు సామాజిక తనిఖీని నిర్వహించారు. నాగసమందర్‌లో చేయని పనులకు బిల్లులు డ్రా చేశారని ప్రజలు నిలదీశారు. గ్రామస్థుల ప్రశ్నలకు అధికారులు సమాధానం చెప్పలేదు. గ్రామాల్లో పనిదినాలు తక్కువ వేయడం, చెల్లింపులు ఎక్కువ ఉండటంపై మాజీ ప్రజాప్రతినిధులు, ప్రజలు ప్రశ్నించారు. అన్ని గ్రామాల ఎంబీ రికార్డులు ఎందుకు లేవని ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలో ఉపాధి హామీ పనుల్లో రూ.లక్షల్లో అవినీతి జరిగిందని, ఉన్నతాధికారులు వెంటనే విచారణ జరిపాలని ప్రజలు, కూలీలు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డీఆర్‌డీవో పీడీ శ్రీనివాస్, ఏపీడీ సరళ, ఎంపీడీవో నర్సింహులు, ఏపీవో సురేష్, సిబ్బంది పాల్గొన్నారు.

ఘట్‌కేసర్ మునిసిపాలిటీలో రూ.3.60కోట్లతో పనులకు తీర్మానం

ఘట్‌కేసర్, అక్టోబరు 5 : మున్సిపాలిటీలో వార్డుల అభివృద్ధికి రూ.3.60కోట్లతో పనులు చేపట్టాలని తీర్మానించారు. శనివారం మున్సిపల్ చైర్‌పర్సన్ ముల్లి పావని జంగయ్య అధ్యక్షతన జరిగిన సర్వసభ్య సమావేశంలో పలు తీర్మానాలు చేశారు. వార్డుకు రూ.20లక్షలలో వివిధ పనులు చేయాలని తీర్మానించారు. ఇందుకు రూ.3.6కోట్లు అవసరమువుతాయని పేర్కొన్నారు. విలీన గ్రామాల్లో పనులు, సిబ్బంది వేతనాలను రానున్న మార్చి వరకు చెల్లించాలని ఆమోదించారు. అలాగే విలీన గ్రామాల్లో పన్నుల వసూళ్లు, హెచ్‌హెచ్‌డీ డివైస్‌లు కొనుగోళ్లకు తీర్మానించారు. చెత్తసేకరణ ఆటోల నిర్వాహణ, పబ్లిక్ టాయ్‌లెట్స్ పే యూజ్ విధానంలో ప్రైవేట్ ఏజెన్సీలకు అప్పగించాలని నిర్ణయించారు. వార్డుల్లో సద్దుల బతుకమ్మ ఉత్సవాల నిర్వహణకు అవసరమైన నిధుల విడుదలకు నిర్ణయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో వైస్‌చైర్మన్ పల్గుల మాధవరెడ్డి, కమిషనర్ ఎండీ సాబెర్ అలీ, కౌన్సిలర్లు, కోఆప్షన్ మెంబర్లు, అధికారులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న చైర్ పర్సన్ పావని

కొనసాగుతున్న బతుకమ్మ సంబరాలు


మేడ్చల్ మున్సిపల్ కార్యాలయ ఆవరణలో మహిళలతో బతుకమ్మ ఆడుతున్న చైర్‌పర్సన్ దీపిక


వికారాబాద్‌లోని వికాస్ కళాశాలలో బతుకమ్మ వేడుక


పరిగిలో బతుకమ్మ సంబరాల్లో మహిళలు


మేడ్చల్‌లోని సెయింట్ పీటర్స్ ఇంజినీరింగ్ కళాశాలలో బతుకమ్మ సంబరాలు నిర్వహిస్తున్న విద్యార్థులు


తాండూరు సింధు డిగ్రీ కళాశాలలో బతుకమ్మ వేడుక

సంక్షిప్తంగా...

● **పరిగి:** రంగారెడ్డి జిల్లా మహేశ్వరంలో శనివారం బీఆర్ఎస్ చేపట్టిన రైతుధర్నాకు పరిగి నుంచి పార్టీ శ్రేణులు భారీగా తరలివెళ్లాయి. మాజీ ఎమ్మెల్యే కె.మహేశ్‌రెడ్డి ఆధ్వర్యంలో వాహనాల్లో తరలివెళ్లారు. కె.మహేశ్‌రెడ్డి అక్కడ జరిగిన ధర్నాలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి సబితారెడ్డిలతో కలిసి మాట్లాడారు. మహేశ్వరం వెళ్లిన వారిలో నాయకులు మునిసిపల్ చైర్మన్ ఎం.అశోక్, నాయకులు సురేందర్, ఆర్.అంజనేయులు, బి.ప్రవీణ్‌రెడ్డి, వెంకటయ్య, శ్రీనివాస్; రవికుమార్ తదితరులు ఉన్నారు.

● **పూడూరు:** నేడు(ఆదివారం) దామగుండం అటవీ ప్రాంతంలో నిర్వహిస్తున్న సేవ్ దామగుండం అనే నినాదంతో ప్రతి ఒక్కరూ కదిలిరావాలని దామగుండం అటవీ పరిరక్షణ జేఏసీ ప్రతినిధులు పిలుపునిచ్చారు. నేటి మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 6గంటల వరకు సేవ్ దామగుండంతోపాటు బతుకమ్మ కార్యక్రమంలో నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య అధ్యక్షురాలు విమలక్క, పర్యావరణ శాస్త్రవేత్తలు, ప్రొఫెసర్లు, జర్నలిస్టులు, మాజీ ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి, చెరుకు సుధాకర్, మాజీ ఎంపీపీ మల్లేశం హాజరువుతున్నట్లు తెలిపారు. సమీప గ్రామాల ప్రజలు ప్రతి ఒక్కరూ హాజరై సేవ్ దామగుండం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు.

● **కులకచర్ల:** మండలంలోని ఇప్పాయిపల్లిలో అనారోగ్యంతో యాదయ్య(60) మృతిచెందాడు. అంత్యక్రియల నిమిత్తం అతడి కుటుంబానికి ఫీల్డ్ అసిస్టెంట్ నర్సిములు రూ.3వేలు ఆర్థిక సహాయం అందించారు. యాదయ్య క్యాన్సర్‌తో బాధపడుతూ శనివారం ఉదయం హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో మృతిచెందాడు. నర్సిములు స్పందించి కుటుంబానికి ఆర్థిక సహాయం అందించారు. కార్యక్రమంలో బాల్‌రెడ్డి, చిన్న వెంకటయ్య, సత్తయ్య మొగులయ్య తదితరులు పాల్గొన్నారు.

● **కొడంగల్:** ప్రతీ వాహనదారుడు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని కొడంగల్ సర్కిల్ సీఐ శ్రీధర్‌రెడ్డి అన్నారు. శనివారం కొడంగల్ పట్టణంతో పాటు మండలంలోని చిట్లపల్లి టోల్‌గేటు దగ్గర కొడంగల్, బొంరాస్‌పేట్, దౌల్తాబాద్ ఎస్సైలు సత్యనారాయణ, అబ్దుల్ రవూఫ్, రవి గౌడ్, పోలీసు సిబ్బందితో కలిసి నెంబర్ ప్లేటు లేని వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ వాహనాలకు నెంబరు ప్లేట్లు, ట్రిపుల్ రైడింగ్, డ్రంకెన్ డ్రైవ్‌పై వాహనదారులకు అవగాహన కల్పించారు. 40 మంది వాహనాలకు జరిమానాలు విధించారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. వాహనాలకు తప్పనిసరిగా నంబరు ప్లేట్ కలిగి ఉండాలన్నారు.

● **వికారాబాద్:** అమెరికాకు చెందిన సత్యసాయి భక్తులు గ్లోబల్ ఫస్ట్ రెస్పాండర్ సంస్థ ప్రతినిధులు వికారాబాద్ మండల పరిధిలోని మదన్‌పల్లిలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామంలో 200 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి వారికి కావాల్సిన మందులను పంపిణీ చేశారు. ఇదిలా ఉండగా వికారాబాద్‌కు చెందిన యజ్ఞ ఫౌండేషన్ విద్యార్థులు వలంటీర్లుగా పని చేయగా డాక్టర్ ఉజ్వల్‌కుమార్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు సదానందారెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, రాముర్డెడ్డి, వెంకట్‌రెడ్డి, రాములు, మాదవరెడ్డి, సోమిరెడ్డి, గ్రామ కార్యదర్శి రమేష్, సంగన్న, రాములు, రామచంద్ర పాల్గొన్నారు.

● **శామీర్‌పేట:** దేవీ శరన్నవరాత్రోత్సవాల్లో మండప నిర్వాహకులు, సౌండ్ సిస్టమ్ ఆపరేటర్లు పోలీసుశాఖ నిబంధనల మేరకు మాత్రమే నడుచుకోవాలని, అధిక సౌండ్‌ను పెట్టినట్లైతే చర్యలను తీసుకుంటామని ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్ హెచ్చరించారు. పోలీస్‌స్టేషన్‌లో మండలంలోని వివిధ గ్రామాల్లో దేవినవరాత్రి ఉత్సవాల మండపాల ఆర్గనైజర్లు, సౌండ్‌సిస్టమ్ ఆపరేటర్లతో ఇన్‌స్పెక్టర్ సమావేశాన్ని నిర్వహించారు. మండపాల్లో రాత్రి 10 నుంచి ఉదయం 6గంటల వరకు ఎక్కువ సౌండ్ పెట్టొద్దన్నారు. ప్రతీ సౌండ్ సిస్టమ్ ఆపరేటర్ తప్పని సరిగా డీసీపీ మేడ్చల్ జోన్ కార్యాలయం నుంచి బిజినెస్ లైసెన్స్ తీసుకోవాలని ఆయన సూచించారు.

క్రైం కార్నర్

బైక్ ఢీకొని లారీ డ్రైవర్ దుర్మరణం

మేడ్చల్ టౌన్, అక్టోబరు 5: వెనుక నుంచి వచ్చిన బైక్ ఢీకొని నడుచుకుంటూ వెళ్తున్న ఓ లారీ డ్రైవర్ మృతిచెందిన ఘటన మేడ్చల్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉత్తరప్రదేశ్‌లోని అలహాబాద్‌కు చెందిన జగదీష్(35) లారీ డ్రైవర్. శనివారం మునీరాబాద్ ఓఆర్ఆర్ సర్వీస్ రోడ్డు సమీపంలో లారీని పార్క్‌చేసి క్లీనర్‌తో కలిసి టిఫిన్ చేసేందుకని నడుచుకుంటూ వెళ్లాడు. అదే సమయంలో వెనుక నుంచి బైక్‌పై వచ్చిన అనంతకుమార్.. జగదీష్‌ను ఢీకొట్టాడు. జగదీష్ తలకు గాయలై అక్కడికక్కడే మృతిచెందాడు. స్థానికుల సమాచార ంతో పోలీసులు చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం గాంధీ మార్చురీకి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని సీఐ సత్యనారాయణ తెలిపారు.

ప్రియుడి హత్య కేసులో ప్రియురాలి అరెస్టు


పోలీసుల అదుపులో అనిత

ధారూరు, అక్టోబరు 5: ప్రియుడిని మరి కొందరితో కలిసి హత్య చేయించిన కేసులో పరారీలో ఉన్న అనిత అనే మహిళను శనివారం రిమాండ్‌కు తరలించినట్టు ధారూరు సీఐ భీంకుమార్ తెలిపారు. కోట్‌పల్లి అన్నాసాగర్‌కు చెందిన శ్రీకాంత్‌ను మల్లేశం, బంటు బందెల్లి, మొల్ల బందెల్లి, అంజప్పలతో కలిసి అనిత హత్య చేయించిందన్నారు. పరారైన అనిత చేవేళ్ల మండలం కౌకుంట్లలో ఉన్నట్లు సమాచారం రావడంతో అక్కడికి వెళ్లి అరెస్టు చేసినట్టు చెప్పారు. ఆమె హత్యానేరం ఒప్పుకోవడంతో కోర్టు సూచనతో రిమాండ్‌కు తరలించినట్టు సీఐ తెలిపారు.